
ఇదేనా స్వచ్ఛ రాయదుర్గం?!



10వ వార్డు పరిధిలో భావన స్కూల్ వద్ద రోడ్డుపై చేరిన మురుగు



రాయదుర్గం పట్టణంలోని ఓ వీధిలో పందుల సంచారం



పాత మీసేవ కేంద్రం 2, 7వ సచివాలయం పక్కనే చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువ

రాయదుర్గంటౌన్: స్వచ్ఛ రాయదుర్గం మాట ప్రకటనలకే పరిమితమవుతోంది. పట్టణంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. డ్రెయినేజీలో మురుగు ముందుకు సాగడం లేదు. ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమలు రాజ్యమేలుతున్నాయి. అనేక వార్డుల్లో మురుగునీరు దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలు పడితే మురుగు కాస్తా రోడ్డుపై పారుతోంది. వార్డుల్లోని చిన్న కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. కొలిమివీధిలో మురుగు ముందుకెళ్లే మార్గం కనిపించడం లేదు. ఈ క్రమంలో పందుల సంచారం కూడా అధికమైంది. ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం, మురుగు నిలిచి రోగాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

తాగునీటి పైపులైను లీకేజీ



మారెమ్మగుడి ఏరియాలో లీకేజీతో వృథా అవుతున్న తాగునీరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 21వ వార్డు మారెమ్మగుడి ఏరియాలో ఇళ్లకు సరఫరా అయ్యే డిస్ట్రిబ్యూషన్ తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు వృథా అవడమే కాక కలుషితమవుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. నెల రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ డిష్ గోవిందు మాట్లాడుతూ తాను పలుమార్లు ఏఈ, డీఈల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోయిందన్నారు. ఇప్పటికైనా పైపులైను మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టాలని కోరారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

బొమ్మనహాళ్: ఉంతకల్లులో రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 నుంచి సుశీల నేత్రాలయ, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కర్నూల్ వారిచే కంటి వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు.

జాబ్‌కార్డున్న వారందరికీ 'ఉపాధి'



ఏపీఓ లక్ష్మీకాంతబాయి

బొమ్మనహాళ్: ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్ష్మీకాంతబాయి బుధవారం బాధ్యతలు చేపట్టారు. వజ్రకరూరు ఏపీఓగా పనిచేస్తున్న ఈమె బదిలీపై బొమ్మనహాళ్‌కు వచ్చారు. ఇక్కడ ఇదివరకు ఏపీఓగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మి శింగనమలకు బదిలీ అయిన విషయం విదితమే. నూతన ఏపీఓ లక్ష్మీకాంతబాయి మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు తావులేకుండా పనులు సక్రమంగా జరిగేలా చూస్తానన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

మొక్కల పంపిణీ

కుందుర్పి: ఎనుములదొడ్డి, అడవిగొల్లపల్లి, కై రేవు, కామక్కపల్లి, రమణేపల్లి నర్సరీల్లో పెంచిన మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు కళ్యాణదుర్గం అటవీ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో రైతుకు వంద మొక్కలు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. రైతు పట్టా దారుపాసుపుస్తకం, ఆధార్ నకలుతో దరఖాస్తు ఇవ్వాలని తెలిపారు. నేరేడు, కానుగ, పనస, టేకు, సీతాఫలం, అల్లనేరేడు, వెదురు, సర్వే మొక్కలు, జామ తదితర రకాల మొక్కలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎల్‌ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

బ్రహ్మసముద్రం: మండలంలో దళితులపై దాడులను అరికట్టాలని ఎల్‌ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మండల రమేష్ కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో దళితులపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. దాడులు అరికట్టేలా ప్రతి నెల చివరి శనివారం గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహలింగ, రవికుమార్, కళ్యాణ్, రామాంజి, వన్నూరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'తల్ సైనిక్' ఎంపికే లక్ష్యం కావాలి

- ఎన్‌సీసీ కర్నూలు గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి

కూడేరు: ఈ ఏడాది ఆగస్టులో న్యూఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంప్‌నకు ఎంపిక కావడమే లక్ష్యంగా సాధన చేయాలని ఎన్‌సీసీ క్యాడెట్లకు కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి సూచించారు. కూడేరు మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–5 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. బుధవారం కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి హాజరై, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్‌లో శిక్షణను పరిశీలించారు. ఏకాగ్రత, ఆత్మ విశ్వాసమున్నపుడే అన్నింటా రాణించగలుగుతారని పేర్కొన్నారు. అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన క్యాడెట్లకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సునీత, రాజ్యలక్ష్మి, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ఉమా, నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: బోయలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ దుర్గమ్మ భర్త హనుమంతురాయుడు రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం పార్టీ సీనియర్‌నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, నాయకులు గ్రామానికి చేరుకుని హనుమంతురాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజనేయులు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సత్తి, నాయకులు నారాయణరెడ్డి, జైపాల్‌రెడ్డి, మల్లి, పాతన్న, తిమ్మగానపల్లి మల్లి, మారుతి, అనిల్, నరేష్, రాము, కామక్కపల్లి మల్లి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



పార్టీ పదవులు పొందిన వారితో ప్రమాణం చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో విశ్వ తదితరులు

- అనుబంధ సంఘాలు పార్టీకి పునాదిలా నిలబడాలి
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక గవిమఠం వెనుక వైపు ఉన్న వీరశైవ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంతో పాటు పార్టీలో అనుబంధ సంఘాల కమిటీ సభ్యుల నియామక పత్రాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరావడంతో సమావేశం విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి హాజరయ్యారు. సభాధ్యక్షుడు నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అరాచక పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలతో పాటు పార్టీ నియోజకవర్గ, మండల కమిటీల్లో ఎంపికైన వారు మరింత బాధ్యతగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనుబంధ సంఘాలు పార్టీకి పునాదిగా నిలబడాలని ఆకాంక్షించారు.

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ దుమ్ము లేపడం ఖాయం

సంక్షేమ పథకాల అమలును అటకెక్కించిన కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి అన్నారు. మధ్యంతర ఎన్నికలు వస్తే ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. స్వయనా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ సాక్షిగా రూ.10 లక్షలు కోట్లు అప్పులు చేశామని రాష్ట్ర పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం మోసం చేసిందని, పథకానికి రూ.12,700 కోట్లు అవసరం ఉండగా కేవలం రూ.9 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఉరవకొండలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై భౌతిక దాడులకు దిగారని తెలిపారు. అయితే ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటామని, అందరికి తగిన రీతిలో సమాధానం చెబుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ఎంపీపీలు దేవిభాయి, కరణం పుష్పవతి, నరసింహులు, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, దేవా, శివలింగ, రాకెట్ల అశోక్, భరత్‌రెడ్డి, జగదీష్, వెంకటేష్, ఏసీ ఎర్రిస్వామి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తిప్పయ్య, బసవరాజు, పాటిల్ నాగిరెడ్డి, శ్రీనివాసులు, యోగేంద్రరెడ్డి, దేవేంద్ర, ధనంజయ, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మచ్చన్న, సోమశేఖర్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, జోనేకల్లు రమేష్, త్రిలోక్‌రెడ్డి మహిళా నాయకురాలు చంద్రమ్మ, బోయ సుశీలమ్మ, వసంతమ్మ, ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరువు



పెరుగుపాళ్యంలో సచివాలయానికి ఉన్న రంగులను వెంటనే తొలగించాలని ఆదేశిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'కూటమి ప్రభుత్వ తొలి ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి వెళ్లిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా శెట్టూరు మండలం పెరుగుపాళ్యం, ములకలేడు, తిప్పనపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో చేతికందే ఎత్తులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు, వితంతు పింఛన్లు, కొత్త పింఛన్ల కోసం ప్రజల నుంచి సమస్యల స్వాగతం లభించింది. ఓ వైపు ప్రజలు సమస్యలను ఏకరువు పెడుతుంటే ఎమ్మెల్యే మాత్రం ప్రజా సమస్యలను పక్కనపెట్టి వైఎస్సార్‌సీపీ పాలనపై బురదజల్లే ప్రయత్నం చేయడం కొసమెరుపు. ఇక పెరుగుపాళ్యంలో గ్రామ సచివాలయానికి వైఎస్సార్‌సీపీ రంగులు ఉన్నాయంటూ ఎమ్మెల్యే అధికారులపై చిందులు వేశారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు వేతనాలివ్వాలి



కార్మికులకు సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలివ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల కోసం బుధవారం చేపట్టిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. శ్రీరామిరెడ్డి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సుమారు ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మూడు నెలలుగా కార్మికుల వేతనాల కోసం సమ్మె చేస్తున్నా జిల్లా యంత్రాంగం ఎందుకు చొరవ చూపలేదని నిలదీశారు. బకాయిలు చెల్లించమని కోరితే కార్మికులపై ఎస్మా ప్రయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికుల పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోళ్ల సూరి, బ్రహ్మసముద్రం మండలం కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దొడగట్ట మురళి, ట్రేడ్ యూనియన్ ప్రకాష్ మద్దతు తెలిపారు. శ్రీరామిరెడ్డి కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే తానే స్వయంగా సొంత డబ్బు చెల్లిస్తామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. పాదయాత్రకు ఎంఆర్‌పీఎస్ గురుమూర్తి, యువరాజ్యం అలెక్స్, కాంగ్రెస్ నేత బోయ నాగరాజు, దాదాఖలందర్, ఈశ్వర్ ప్రసాద్, యూత్ కాంగ్రెస్ ప్రశాంత్, చైతన్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు హనుమంతరాయుడు, రంగనాథ్, అచ్యుత్ ప్రసాద్, కార్మిక సంఘం నాయకులు వన్నూరుస్వామి, సుమన్, రాము, సతీష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించడం వృథా

- డీవీఎంసీ సమావేశంలో సభ్యుల అభ్యంతరం



సమస్యలపై ప్రశ్నిస్తున్న డీవీఎంసీ సభ్యుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు

కళ్యాణదుర్గం: ప్రతి మూడు నెలలకోసారి డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశాలు తూతూ మంత్రంగా నిర్వహించడం వృథా ప్రయాస అని డీవీఎంసీ సభ్యుడు, కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కళ్యాణదుర్గంలోని ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ వసంతబాబు అధ్యక్షతన డీవీఎంసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, కళ్యాణదుర్గం ఎంపీపీ మారుతమ్మ, సభ్యులు భవాని, కోనంపల్లి మోహన్ పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో దళిత, గిరిజనులపై జరుగుతున్న అఘాయిత్యాలు, కుల వివక్షను తెలియజేశారు. గత డీవీఎంసీ సమావేశంలో చర్చించిన అంశాలపై పురోగతి లేనప్పుడు ఇలాంటి సమావేశాలు ఎందుకు నిర్వహించాలని నిలదీశారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశాలకు కూడా ఆయా మండలాల అధికారులు రాకపోతే ఎస్సీ, ఎస్టీ సమస్యలపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో నిత్యం దళిత, గిరిజనులకు ఏదో ఒక చిన్న సమస్య తలెత్తుతుందన్నారు. ముఖ్యంగా దళిత, గిరిజనులకు ప్రభుత్వం అందించిన అసైన్‌మెంట్ భూములకు రికార్డులు తారుమారు చేసేందుకు పలువురు తహసీల్దార్లు సహకరిస్తున్నారని తెలిపారు.

నిధులు వెనక్కి..

కళ్యాణదుర్గంలో గత ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ భవనం కోసం ఎకరం స్థలాన్ని కేటాయించడంతో పాటు రూ.2 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. అనంతరం గుమ్మగట్ట ఎంపీపీ భవాని మాట్లాడుతూ గత 10 నెలల క్రితం కలుగోడులో జరిగిన ఓ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం చూపలేదన్నారు. అనంతరం డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ ఏ చిన్న సమస్య వచ్చినా ఎస్సీ, ఎస్టీలు నేరుగా తనను సంప్రదించాలన్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి చొరవ చూపుతామన్నారు. ముద్దినాయనపల్లిలో ఎస్టీ గురుకుల పాఠశాల పూర్తి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, వార్డెన్ నాగరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

బడే ముద్దు .. పనిలోకి పంపొద్దు



కూడేరు: సర్వే చేస్తున్న సీఆర్పీ, ఉపాధ్యాయుడు

కూడేరు: బడిఈడు పిల్లలంతా బడుల్లో ఉండాలని, పనుల్లో పెట్టి వారి భవిష్యత్‌ను నాశనం చేయవద్దని సీఆర్పీ రమణ, ఉపాధ్యాయుడు వెంకటప్ప పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కూడేరు మండల పరిధిలోని ఎంఎంహళ్లిలో బడి బయట పిల్లల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

వజ్రకరూరు: వేరుశనగ విత్తడానికి ముందు ట్రైకోడెర్మావిరిడితో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఉరవకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని రాగులపాడు గ్రామంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, ఏఓ మధుకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలిచ్చారు.

ఆర్డీటీని కాపాడండి

కూడేరు: పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆర్డీటీని కాపాడాలని కూడేరు మండల పరిధిలోని జయపురానికి చెందిన మహిళలు బుధవారం గ్రామానికి వచ్చిన మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

భక్తుల భిక్షాటన

వజ్రకరూరు: స్థానిక షిర్డిసాయి ఆలయంలో జూలై 10న గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం వజ్రకరూరులో భక్తులు భిక్షాటన నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో షిరిడిసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి పురవీధులగుండా ఊరేగించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మనహాళ్: చంద్రగిరి శివారులోని తుమ్మచెట్టు వద్ద బుధవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.7,200 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



ఉంతకల్లులో కొలువుదీరిన పీర్లు



అలంకరణలో పీర్ల దేవుళ్లు



కలుగోడులో పీర్ల స్వాములు

బొమ్మనహాళ్: కులమతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు మండలంలో ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో పీర్లచావిడి దగ్గర ఐదు రోజులముందే అలాయి గుంతలు తవ్వారు. ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, కురువల్లి, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కల్‌హోళ, గోనేహాళ్, శ్రీధరఘట్ట తదితర గ్రామాల్లో పీర్లను కొలువుదీర్చారు. ఈ నెల 6న పెద్ద సరిగెత్తు, 7న ఉయదం పీర్ల గ్రామోత్సవం, సాయంత్రం జలధి నిర్వహించనున్నారు.

కొలువుదీరిన పీర్ల దేవుళ్లు

కూడేరు: మండల కేంద్రంలోని పీర్లచావిడిలో పెద్ద వన్నూరు స్వామి , చిన్న వన్నూరు స్వామి, మౌళాలి, బొడ్డు, పెద్దలాల్, చిన్నలాల్ పీర్ల దేవుళ్లు కొలువు దీరారు. ముజువార్ మైనుద్దీన్ పీర్ల దేవుళ్ల వద్ద ప్రార్థనలు చేపట్టారు. శనివారం చిన్న సరిగెత్తు, ఆదివారం విడిదినం, సోమవారం పానకాల మహోత్సవం, మంగళవారం జలధి కార్యక్రమంతో పీర్ల పండుగ వేడుకలు ముగుస్తాయన్నారు.

కులమతాలకు అతీతంగా మొహర్రం

గుమ్మఘట్ట: కలుగోడు, గలగల, భూపసముద్రం, గోనబావి, పూలకుంట, తాళ్లకెర, కె.పి.దొడ్డి గ్రామాల్లో పీర్లస్వాములను గ్రామ చావిడిలలో కొలువుదీర్చారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకలను నిర్వహించేందుకు ఆయా గ్రామాల ప్రజలు తగిన ఏర్పాట్లు చేశారు. పీర్లకు భక్తులు చక్కెర, బెల్లంతో చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన కోకిల వసంతను బుధవారం ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు వసంత సేవలను కొనియాడారు.

గోకులం లబ్ధిదారులకు బిల్లులు

వజ్రకరూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గొకులంషెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు అయినట్లు ఏపీఓ విమల తెలిపారు. బుధవారం మండలంలో మొత్తం 31 మంది లబ్ధిదారులకు రూ.16.52 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వజ్రకరూరు: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శివాజీరెడ్డి, ఉపాధిహామీ ఏపీఓ విమల హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పనులు అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎక్కడైనా పనులు కల్పించలేదని ఫిర్యాదులు వస్తే సంబంధిత ఎఫ్ఎ, టీఏలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వజ్రకరూరులో జల్లులు

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం మోస్తరు జల్లులు కురిశాయి. చిరుజల్లులు పంటల సాగుకు మేలు చేస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు.

పోటాపోటీగా సాగు భూముల వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారి దాసు

కణేకల్లు: మాల్యం గ్రామంలో కల్లేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన సాగు భూముల వేలం పాటలు మంగళవారం పోటాపోటీగా సాగాయి. దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి విజయకుమార్, దేవదాయ శాఖ అధికారి దాసు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలకు 43ఉడేగోళం, మాల్యం గ్రామ రైతులు పాల్గొన్నారు. 16 ఎకరాల తరి (హెచ్చెల్సీ ఆయకట్టు) భూమి వేలం రూ.7.66 లక్షలు పలికింది. మిగిలిన 40 ఎకరాల మెట్ట భూములు వేలం వేయగా రూ.43,500కు పలువురు రైతులు దక్కించుకొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రూ.1,29,500 అదనంగా లాభం వచ్చినట్లు దేవదాయశాఖ అధికారి దాసు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు విజయకుమార్, శరబన్నగౌడ్, మల్రేగౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ దాణాను సద్వినియోగం చేసుకోండి

బెళుగుప్ప: మండలంలోని పాడి పశువుల రైతాంగం ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందించే పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని బెళుగుప్ప పశు వైద్యాధికారి మంజునాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పశు వైద్యా కేంద్రంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో దాణా పంపిణీ ప్రారంభించారు.